క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక

మరికల్ : జిల్లా కేంద్రంలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనబర్చిన మరికల్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లు జీహెచ్‌ఎం నాగరత్నమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావ్య, నవ్య సైన్స్ ఫెయిర్‌లో చేసిన ప్రయోగాలకు కలెక్టర్ ప్రశంసించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఉపాధ్యాయులు తదితరులు అభినందనలు తెలియజేశారు.

సబ్సిడీపై పీఎస్‌బీ

కోస్గి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు 50 శాతం సబ్సిడీపై ఫాస్ఫేట్ సాల్యూబులైసింగ్ పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫాస్ఫేట్ సాల్యూబులైసింగ్ కేజీ ధర రూ.40 లు ఉండగా రాయితీపై రూ.20కు అందించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సకాలంలో బోనస్ చెల్లించాలి

దామరగిద్ద : ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో బోనస్ డబ్బులు చెల్లించాలని బీకేఎస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బాల్‌చందర్‌రెడ్డి అన్నారు. నెల రోజులు గడిచిన బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమకావడం లేదన్నారు. గత నెల 18 వరకు విక్రయించిన రైతులకు మాత్రమే బోనస్ పడుతుందన్నారు. వెంటనే రైతులకు డబ్బులు చెల్లించాలని కోరారు.

ఆయకట్టు రైతులకు నీటి విడుదల



ధన్వాడ: ధన్వాడ పెద్ద చెరువు కింద ఉన్న పంట పొలాలకు సోమవారం ధన్వాడ పెద్ద చెరువు నుంచి నీటిని విడుదల చేశారు. రైతుల విన్నపం మేరకు చెరువు తూము నుంచి నీటిని విడుదల చేసినట్లు తహసీల్దార్ సింధుజా తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అబాకస్ విజేతలను అభినందించిన కలెక్టర్



నారాయణపేట రూరల్ : గత నెలలో మహారాష్ట్ర పూణే నగరంలో నిర్వహించిన 7వ జాతీయ, 14వ అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచిన నారాయణపేట విద్యార్థులను సోమవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ అభినందించారు. అబాకస్ సీ–4లో ప్రథమ స్థానం సాధించిన చరణ్, సీ–3లో ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన వైష్ణవి, రిషిక్‌లతో పాటు ప్రోత్సాహక బహుమతి పొందిన ఖుషి నామాజీలతో అబాకస్‌కు సంబంధించిన పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం బహుమతులు, ప్రశంసా పత్రాలు చూసి అభినందించారు. అనంతరం ఉపాధ్యాయురాలు రీతు శర్మను సన్మానించారు.

రైతు భరోసా రూ. 15 వేలు ఇవ్వాలి

ఊట్కూర్ : ప్రభుత్వం సాగు భూములకు ఒకేసారి రూ.15 వేలు ఇవ్వాలని ఏఐయూకేఎస్ జిల్లా జిల్లా ఉపాధ్యక్షుడు జీ.వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ప్రభుత్వం రైతు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ రవికి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 9న దేశ వ్యాప్తంగా డిమాండ్ డే జరపాలని వివిధ సంఘాలు పిలుపునిచ్చినట్లు తెలిపారు. అసంఘటిత కార్మికుల, ఐసీడీఎస్, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు అందడం లేదని ఆరోపించారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్లు, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సలీం, చంద్రాములు, చెన్నప్ప, గోవర్ధన్‌రెడ్డి, బాలప్ప, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెస్పీ చట్టం చేయాలి

ధన్వాడ : పంటలకు గిట్టుబాటు ధరలపై ఎమ్మెస్పీ చట్టాన్ని చేయాలని, సాగు భూములకు రైతు భరోసా ఒకేసారి ఎకరాకు రూ.15వేల ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణయ్య, తిమ్మయ్య, నరసింహులు, తిమ్మన్న, కథలప్ప, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

‘అబద్ధపు హామీలతో మోసం’



జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న నాయకులు



ధన్వాడలో రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో బీఆర్‌ఎస్ శ్రేణులు, రైతులు నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ వైస్ చైర్మన్లు కన్న జగదీశ్, చెన్నారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు సుదర్శన్ రెడ్డి, రాంరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వేపూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి : అబద్ధపు హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సూచనతో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలతో రైతులను మోసం చేసిందని ఆరోపించారు. రైతు భరోసా ఎకరాకు రూ.15,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోస్గిలో..

కోస్గి రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రైతులను మోసం చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు శ్యాసం రామకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని శివాజీ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జనార్దన్, సాయిలు, వెంకటనర్సింలు పాల్గొన్నారు.

ధన్వాడలో..

ధన్వాడ : రైతు భరోసా ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేస్తుందని పార్టీ నాయకుడు సుధీర్‌కుమార్‌రావు విమర్శించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, శివారెడ్డి, చంద్రశేఖర్, మల్లేష్‌గౌడ్, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్దలో..

దామరగిద్ద : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఎకరాకు రూ. 15 వేలు ఇవ్వాల్సిందేనని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుభాష్, మాజీ ఎంపీపీలు నర్సప్ప, వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భీమయ్యగౌడ్‌లు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బాలప్ప, సాయిబన్న, వెంకట్‌రెడ్డి, మొగులప్ప, నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.

మరికల్ : రైతు భరోసాపై మాట మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు గుణపాఠం చెప్పాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి అన్నారు. మరికల్ చౌరస్తాలో సోమవారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాస్తారోకో నిర్వహించారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట మార్చి రూ.12 వేలు ఇస్తామని రైతులను మోసం చేయడం తగదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత ప్రజలు కాంగ్రెస్ పార్టీ డోర్‌ను క్లోజ్ చేస్తారన్నారు. కార్యక్రమంలో బసంత్, కృష్ణారెడ్డి, రామస్వామి, బాలకృష్ణ, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నిరసన కార్యక్రమాలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి

మక్తల్ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాపై మాట తప్పడంపై మంగళవారం నుంచి నియోజకవర్గంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మక్తల్‌లో ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 7న మక్తల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. 8న ఆత్మకూర్, 9న అమరచింత, 10న నర్వ, ఊట్కూర్ మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు అభిమానులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాలను స్వచ్ఛందంగా తీర్చిదిద్దాలి



కిట్లు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

మరికల్ : స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ కన్మనూర్‌గా తీర్చిదిద్దడంతో గువాజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, వస్త్రాలతో కూడిన కిట్లు అందజేశారు. గ్రామాలను స్వచ్ఛందంగా మార్చడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సభ్యులు తెలిపారు. అనంతరం యువక మండలి సభ్యులు, గ్రామస్తులు గువాజ్ స్వచ్ఛంద సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో యువక మండలి అధ్యక్షుడు సురేందర్‌గౌడ్, రవి, రఘు, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



పోటీలో గెలుపొందిన యువకులు

మక్తల్: మక్తల్ మండలం కర్ని గ్రామంలో మహబుబ్ సుభాని ఉర్సు సందర్భంగా సోమవారం నిర్వహించిన సందెపు రాళ్ల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీలో చాలపలి యల్లప్ప ప్రథమ స్థానం, రాజమూని రాజు రెండో స్థానంలో నిలిచారు. విజేతలకు జ్ఞాపికలతోపాటు, నగదు ప్రదానం, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణయ్య గౌడ్, భీమేష్, గాసం నర్సింహ, ఎద్దుల హన్మంతు, వాకిటి హన్మంతు, ఈదనాగరాజు, ఉప్పరి నవీన్, నంబర్ కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలపై కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్ : నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వినతిపత్రం సోమవారం అందజేశారు. నర్వలో కాలనీల్లో రహదారి బంద్ చేసి ఇనుప కంచె ఏర్పాటు చేయడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నట్లు నర్వ గ్రామస్తులు ఎమ్మెల్యేకు తెలియజేశారు. స్పందించిన ఆయన కలెక్టర్ వద్దకు గ్రామస్తులతో వెళ్లి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆర్‌డీఓ రాంచందర్‌నాయక్‌ను గ్రామానికి వెళ్లి సమస్యపై వివరణ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం భూత్పూర్, నేరడుగోమ్ గ్రామాలు, ముంపు గ్రామాల విషయం తెలియజేశారు. కార్యక్రమంలో మక్తల్ మాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేష్, నాయకులు చెన్నయ్య సాగర్‌గౌడ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయఢంకా మోగించాలి



మాట్లాడుతున్న కార్యవర్గ సభ్యుడు కొండయ్య

మక్తల్ : నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయఢంకా మోగించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య అన్నారు. సోమవారం మక్తల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ కమిటీ అధ్యక్షుడు, కార్యదర్శులకు విధి విధానాలు తెలియజేశారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో 6 గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం మాట మార్చిందన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాలని, ప్రజలకు వారధిగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ కొండయ్య, నరేందర్, కుర్వలింగం, నాగరాజుగౌడ్, రాకేష్, కతలప్ప, రాజు, అంజనేయులు తతదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న నాయకులు

కొత్తపల్లి: మండల పరిధిలోని మన్నాపూర్‌లో క్రికెట్ అసోసియేషన్ టోర్నమెంట్‌ను సోమవారం పీఏసీఎస్ అధ్యక్షుడు నర్సింహులు, మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. టోర్నమెంటులో 40 జట్లు పాల్గొనున్నట్లు తెలిపారు. ఫైనల్‌లో విజేతగా నిలిచిన జట్టుకు రూ. 18,000, రన్నర్‌కు 10,000 రుపాయల ప్రైజ్‌మని అందజేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు తిరుపతి రెడ్డి, రమేష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చెన్నయ్య, తిమ్మారెడ్డి, వెంకటయ్య, కృష్ణయ్య, దామోదర్ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

కార్మికులను క్రమబద్ధీకరించాలి

నారాయణ పేట టౌన్: మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని, వారిని క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రామిరెడ్డి, బలరామ్ డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ పార్క్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా కార్మికులు అభద్రతా భావంతో పనిచేస్తున్నారన్నారు. ఎలాంటి రక్షణ కవచాలు లేక తరచూ ప్రమాదాల బారిన పడుతున్నట్లు తెలిపారు. ధర్నా వద్దకు చేరుకున్న తహసీల్దార్ అమరేంద్రకృష్ణకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్, కే.సాయిలు, జాకీర్, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం పోలీసులు

మద్దూరు: అపరిచిత వ్యక్తులతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని షీటీం పోలీసులు బాలరాజు, చిన్నయ్య అన్నారు. సోమవారం మండలంలోని రెణివట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరాల బారిన పడిన వారు 1930 టోల్ ఫ్రీకి సమాచారం ఇవ్వాలని సూచించారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. వేధింపులకు గురైన వారు 87126 70398 , 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో భరోసా టీం దేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

- తల్లిదండ్రులతో వెళ్లిన అమ్మాయి
- ఆందోళన వ్యక్తం చేసిన యువకుడు

నారాయణపేట టౌన్: ప్రేమ వివాహం చేసుకోని రక్షణ కల్పించాలని ఓ ప్రేమ జంట ఆదివారం నారాయణపేట పోలీసులను ఆశ్రయించింది. ఊట్కూర్ మండల కేంద్రానికి చెందిన ఎండీ సుల్తాన్ (25) జిల్లా కేంద్రానికి చెందిన ఓ అమ్మాయి(20) ఇద్దరు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరి వివాహానికి అమ్మాయి తరపు వారు అంగీకరించకపోవడంతో హైదారాబాద్‌లోని ఓ ఖాజీని సంప్రదించి వివాహం చేసుకున్నారు. దీంతో అమ్మాయి తరపు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు తమకు ఫోన్ చేసి స్టేషన్‌కు వచ్చి వెళ్లాలని మీకు రక్షణ కల్పిస్తామని పోలీసులు చెప్పినట్లు యువకుడు సుల్తాన్ తెలిపారు. తీరా ఇక్కడికి వచ్చాక అమ్మాయి కుటుంబ సభ్యులు బలవంతంగా తమను విడదీసి అమ్మాయిని ఇంటికి తీసుకెళ్లారని ఆరోపించాడు. ఈ విషయమై ఎస్సై వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. అమ్మాయి అంగీకారం మేరకే తల్లిదండ్రులతో వెళ్లినట్లు వివరించారు.

తపస్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



మరికల్‌లో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

మరికల్ : మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ఆవరణలో సోమవారం ఎంఈఓ మనోరంజని తపస్ ఉపాధ్యాయ సంఘ నూతన క్యాలెండర్, డైరీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తపస్ మండల అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాలు చేసి ఎన్నో సమస్యలు పరిష్కరించిన ఘనత ఉందన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరులో..

మద్దూరు: తపస్ ఉపాధ్యాయ సంఘ నూతన క్యాలెండర్‌ను తహసీల్దార్ సమక్షంలో సంఘ బాధ్యులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో తపస్ రాష్ట కార్యదర్శి నర్సప్ప, డీటీ కిరణ్, జిల్లా కార్యదర్శి కురుమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడలో..

ధన్వాడ: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ధన్వాడ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల అవరణలో నూతన క్యాలెండర్, డైరీని ఎంఈఓ అధికారి గాయత్రి, హెచ్‌ఎం నరసింహచారి ఆవిష్కరించారు.

జాంద్రా సమాజం క్యాలెండర్ అవిష్కరణ..

కోస్గి రూరల్: శ్రీ కురిహిణిశెట్టి జాంద్రా సమాజం నూతన క్యాలెండర్‌ను పట్టణంలోని శ్రీనీలకంఠస్వామి దేవాలయంలో సోమవారం అవిష్కరించినట్లు జాంద్రా సమాజ అధ్యక్షుడు యేనుగుండ్ల బసన్న ,ప్రధాన కార్యదర్శి మొనె లక్ష్మినారాయణ తెలిపారు.

హామీలు నిలబెట్టుకోవాలని వినతి

దామరగిద్ద: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా నాయకుడు పెద్దింటి తాయప్ప అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ జయరాములుకు అందజేశారు. కార్యక్రమంలో ప్రగతిశీల యవజన సంఘం జిల్లా కోశాధికారి మధు, కర్రెప్ప, పెంటప్ప, కాశప్ప రైతులు పాల్గొన్నారు.

విశ్వకర్మ సంఘ జిల్లా కార్యవర్గం ఎన్నిక

నారాయణపేట రూరల్ : అఖిల భారత విశ్వకర్మ సంఘ జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం పట్టణంలోని మొనప్ప స్వామి దేవాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వెంకటయ్య, గౌరవాధ్యక్షుడిగా నాగేందర్ చారి, ప్రధాన కార్యదర్శిగా రాజప్పచారి, ఉపాధ్యక్షుడిగా నాగమ్మ, కోశాధికారిగా దత్తాత్రేయ చారి, సలహా సభ్యుడిగా దేవన్న చారిలను ఎన్నుకున్నారు. అనంతరం వారితో రాష్ట్ర నాయకులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం చేస్తామన్నారు. విశ్వకర్మ జిల్లా మండల నాయకులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

మక్తల్ : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీఓ రమేష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని బాలుర హాస్టల్‌ను ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. నాణ్యత విషయంలో రాజీపడకూడదన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ : మండలంలోని గోటూర్ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంపీడీఓ సాయిప్రకాష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులకు పౌష్టికాహారం విషయంపై ఆరా తీశారు. సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

మాగనూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాగనూర్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మురళీధర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. ఈ నెల 4న మక్తల్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీల్లో మాగనూర్ పాఠశాల విద్యార్థులు శ్రావణి ఐదు కిల్లోమీటర్ల సైక్లింగ్ పోటీలో మొదటి స్థానం సాధించినట్లు తెలిపారు. అదే విధంగా శివలీల రెండో స్థానం, అఖిల జిల్లా స్థాయిలో చక్కటి ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, ఫిజికల్ డైరెక్టర్ రాకేష్‌శర్మ, ఉపాధ్యాయులు రాఘవేంద్రచారి, బాబురెడ్డి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

8 మంది విద్యార్థులు

మక్తల్ : మండలంలోని సంగంబండ గురుకుల సోషల్ వెల్ఫేర్ పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైన్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, కోచ్‌లు గోపాలం, శ్రీలతలు అభినందించారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి



మరికల్‌లో మాట్లాడుతున్న ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టి మహేందర్

ధన్వాడ: తెలంగాణలో 55 శాతం జనాభా ఉన్న బీసీలకు కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంచంద్రయ్య డిమాండ్ చేశారు. సోమవారం ధన్వాడ మండల కేంద్రంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్లు బీసీలకు 42శాతం స్థానిక సంస్థల్లోనూ, ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి ఇంతరకు నిలబెట్టుకోలేదని ఆరోపించారు. అదే విధంగా రూ.2 లక్షల లోపు రైతులకు పూర్తిగా రుణమాఫీ చేయాలని, రైతు భరోసా రూ.15వేలు ఇవ్వాలన్నారు. రైతు బంధు విషయంలో ప్రభుత్వం అన్నదాతలను మోసం చేస్తుందని దీనిపై పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, శివరాజు, గోవర్ధన్‌గౌడ్, విజయ్ కుమార్, చంద్రశేఖర్, రాజుసాగర్, మల్లికార్జున్, విజయసాగర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి హామీని అమలు చేయాలి..

మరికల్ : కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టి మహేందర్ డిమాండ్ చేశారు. మరికల్‌లో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంటనే బీసీలకు న్యాయం చేసేలా రిజర్వేషన్ అమలు చేయాలని ఈ నెల 7న ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో మండల కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నర్సన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీరామ్, సురేందర్‌గౌడ్, నిఖిల్, వెంకటేష్, రమేష్, నగేష్ పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేసి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వాటి ఫలాలు అందించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు కేంచె శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం నారాయణపేటలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం బీసీలను ఉపయోగించుకొని అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయిన అమలు చేయక పోవడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రాములు, ఉదయభాను, నర్సింహులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు